సాక్షి నిజామాబాద్

సోమవారం ၊ 15 ၊ సెప్టెంబర్ ၊ 2025



అంగన్‌వాడీల..

కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత తదితర డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఉద్యమబాట పట్టారు.

- 8లో ▸



ఆర్టీసీ 'యాత్రాదానం'

పర్యాటకులకు విభిన్న సేవలందించేందుకు ఆర్టీసీ 'యాత్రాదానం' పథకాన్ని ప్రారంభించినట్లు ఆర్‌ఎం జ్యోత్స్న పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.0 /22.2

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

మోతాదుకు మించి యూరియా వాడొద్దు



మోపాల్: వరికి యూరియాను మోతాదుకు మించి వాడొద్దని జిల్లా వ్యవసాయాధికారి మేకల గోవింద రైతులకు సూచించారు. ఆదివారం మండలంలోని బోర్గాం(పి), మోపాల్ సొసైటీ గోదాములను పరిశీలించి యూరియా, ఇతర ఎరువుల నిల్వలు, రిజిస్టర్, స్టాక్‌బోర్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నానో యూరియాను వినియోగిస్తే మొక్కకు 90 శాతం వరకు చేరుతుందని తెలిపారు. తద్వారా మొక్క ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. జిల్లాలో యూరియా కొరత రాకుండా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా, కృత్రిమ కొరత సృష్టించకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామన్నారు. ఆయన వెంట సొసైటీ సిబ్బంది ఉన్నారు.

ఎత్తేసామొద్దీన్ నేతృత్వంలో బంగారు పతకం



నిజామాబాద్‌నాగారం: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సింగ్ క్రీడాకారిణి జాస్మిన్ బంగారు పతకం సాధించింది. శనివారం రాత్రి ఇంగ్లాండ్‌లో జరిగిన టోర్నీలో పోలాండ్ క్రీడాకారిణిని 4–1 తేడాతో ఓడించింది. కాగా, జాస్మిన్‌కు బాక్సింగ్ కోచ్‌గా జిల్లా చెందిన మహ్మద్ ఎత్తేసామొద్దీన్ వ్యవహరించారు. దీంతో బాక్సింగ్ క్రీడాకారుడు, జాతీయస్థాయి అథ్లెటిక్స్ గోల్డ్‌మెడలిస్టు సయ్యద్ ఖైసర్ కోచ్ ఎత్తేసామొద్దీన్‌ను అభినందించారు.

కేసుల పరిష్కారంలో జిల్లాకు 4వ స్థానం

- లోక్ అదాలత్‌లో 7,444 కేసులు రాజీ
- సీపీ సాయిచైతన్య



ఖలీల్‌వాడి: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన, రాజీ పడటానికి అవకాశం ఉన్న 7,444 కేసులను జాతీయ మెగా లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చినట్లు సీపీ సాయిచైతన్య ఆదివారం తెలిపారు. బీఎన్‌ఎస్(ఐపీసీ) కేసులు 501, ఈ–పెట్టీ కేసులు 1958, డీడీ, ఎంవీఐ యాక్ట్‌లో 4,985 కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు. 138 సైబర్ క్రైమ్ కేసులలో రూ.42,45,273 తిరిగి సైబర్ బాధితులకు ఇప్పించేందుకు ఆర్డర్ కాపీలను సంబంధిత బ్యాంక్ నోడల్ అధికారులకు పంపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సైబర్ క్రైమ్, వివిధ కేసులలో రాజీమార్గం చేసినందుకు జిల్లాకు 4వ స్థానం లభించిందన్నారు. ప్రజలు సైబర్ మోసాలకు గురైతే టోల్‌ఫ్రీ నెంబర్ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. లోక్ అదాలత్‌ను విజయవంతం చేసినసైబర్ క్రైమ్ డీఎస్పీ వై వెంకటేశ్వర్ రావు, సీఐ ముఖీద్ పాషా, రిజర్వ్ సీఐ సతీశ్, కోర్ట్ డ్యూటీ, సైబర్ సెల్ సిబ్బందిని అభినందించారు.




నిజాంసాగర్ ప్రాజెక్టు

చెదరని చరిత్ర

- ఉమ్మడి జిల్లాలో భారీ ప్రాజెక్టులు ● రాళ్లు, డంగు సున్నంతో నిర్మాణం ● భారీ వరదలను తట్టుకుని నిలబడుతున్న కట్టడాలు
- గడీలు, ఆలయాలు ఎన్నో అద్భుత కట్టడాలు ● నేడు ఇంజినీర్స్ డే

నాటి ఇంజినీర్ల నైపుణ్యం, అంకితభావానికి ల్యాండ్ మార్క్‌గా నిలుస్తున్నాయి ఉమ్మడి జిల్లాలోని కట్టడాలు. రాళ్లు, డంగు సున్నంతో నిర్మించిన ప్రాజెక్టులు భారీ వరదలను తట్టుకుని చరిత్రలో నిలిచి ఉన్నాయి. నిజాం పాలనలో నాటి చీఫ్ ఇంజినీర్ నవాబ్ అలీ జంగ్ ఉమ్మడి జిల్లాలో రూపకల్పన చేసిన నిజాంసాగర్, పోచారం ప్రాజెక్టులతోపాటు అలీసాగర్ రిజర్వాయర్‌లు ఆయకట్టుకు జీవం పోస్తున్నాయి. చెరువులో ఏ స్థాయిలో నీరున్నా ఆయకట్టుకు నీరందించేలా శీలం జానకీబాయి సిర్నాపల్లి చెరువులో నిర్మింపజేసిన మూడంచెల తూము 'ఔరా' అనిపిస్తోంది. ఇలా ఉమ్మడి జిల్లాలో అనేక కట్టడాలు చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇంజినీర్స్‌డే సందర్భంగా 'సాక్షి' కథనం..

మూడంచెల తూము



సిర్నాపల్లి జానకీబాయి చెరువులో నిర్మించిన మూడంచెల తూము

ఇందల్వాయి: అద్భుతమైన ఇంజినీరింగ్‌కు సిర్నాపల్లి జానకీబాయి చెరువుతూము అద్దం పడుతోంది. మూడు అంచెలుగా నిర్మించిన తూము ద్వారా కింది ప్రాంతంలో ఉన్న చెరువులకు నీటిని వదులుతారు. చెరువులో నీటిమట్టాన్ని బట్టి ఒక్కో తూమును తెరుస్తారు. కేవలం బండ రాళ్లతో నిర్మించిన తూము ఇప్పటికీ చెక్కు చెదరలేదు. చెరువులో చివరి నీటి బొట్టు వరకు ఉపయోగించే విధంగా తూమును నిర్మించారు.



ఇరవైఏళ్ల ఇంజినీర్ల శ్రమ

- ఇంజినీరింగ్ నైపుణ్యానికి ప్రతీక ఎస్సారెస్పీ

బాల్కొండ: ఉత్తర తెలంగాణ కల్పతరువు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నాటి ఇంజినీర్ల నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తోంది. 1963 జూలైలో పనులు ప్రారంభం కాగా 1983లో పూర్తయ్యింది. ఇరవై సంవత్సరాలపాటు ఇంజినీర్ల చేసిన కృషి 62 ఏళ్లు గడుస్తున్నా చెక్కు చెదరకుండా నిలబడింది. మిగులు జలాలను గోదావరిలోకి విడుదల చేసేందుకు నిర్మించిన 42 వరద గేట్లు ఎస్సారెస్పీకే ప్రత్యేక ఆకర్షణ.

18 లక్షల ఎకరాలకు సాగునీరు, 36 మెగావాట్ల విద్యుదుత్పత్తి, చేపల పెంపకం లక్ష్యాలుగా.. 112 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో 1091 అడుగుల నీటిమట్టంతో 175చదరపు మైళ్ల విస్తీర్ణంలో నిర్మించారు. వరద తాకిడిని తట్టుకునే సువిశాలమైన బండరాయి ప్రాంతాన్ని ప్రాజెక్టు నిర్మాణం కోసం ఎంచుకున్నారు. 16 లక్షల క్యూసెక్కుల వరద నీటిని తట్టుకునేలా ఆనాటి ఇంజినీర్లు డిజైన్ చేసి 50 అడుగుల వెడల్పు, 33 అడుగుల ఎత్తుతో మొత్తం 42 వరద గేట్లను ని ర్మించారు. పూడిక పోయేలా ఆరు రివర్స్ స్లూయిస్ గేట్లు నిర్మించారు.



డంగు సున్నం, బండ రాళ్లు..

ఎస్సారెస్పీ నిర్మాణంలో అధికంగా డంగు సున్నం, బండరాళ్లను వినియోగించినట్లు ఇంజినీర్లు తెలుపుతున్నారు. కుడి, ఎడమల 14 కిలోమీటర్ల మేర ఆనకట్ట నిర్మించారు. ఆనకట్టకు రివిట్ మెంట్ నిర్మాణం కోసం పెద్దపెద్ద రాళ్లను వినియోగించారు.

రాతి కట్టడాలు..

డొంకేశ్వర్(ఆర్మూర్)/ఇందల్వాయి : ఇంజినీర్లే లేని కాలంలో నిర్మించిన భవనాలు, ఆలయాలు ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. కేవలం రాళ్లు, డంగు సునాన్ని మాత్రమే ఉపయోగించడం ప్రత్యేకత.

200 ఏళ్ల నాటి రామలింగేశ్వరాలయం



కుస్తాపురం రామ లింగేశ్వర ఆలయాన్ని రెండు వందల ఏళ్ల క్రితం నిర్మించినట్లుగా చరిత్రకారులు చెబుతున్నారు. గుడిని పూర్తిగా రాతితో నిర్మించారు. 1965 సమయంలో ఎస్సారెస్పీ ప్రాజెక్టు కట్టడంతో కుస్తాపురం గ్రామాన్ని ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఆలయం కొన్నేళ్లుగా బ్యాక్ వాటర్ ముంపులోనే ఉంటోంది. రెండు సార్లు తేలినా గుడి చెక్కు చెదరకుండా ఉంది.

సిర్నాపల్లిలో గడి..



సిర్నాపల్లి సంస్థానాధీశురాలు జానకీబాయి అధికారిక భవనాన్ని(గడి) 1870వ దశకంలో అద్భుతంగా నిర్మించారు. ఇటుక, మట్టి గోడలు, డంగు సున్నంతో చేపట్టిన నిర్మాణం 150 ఏళ్ల గడుస్తున్నా చెక్కు చెదరలేదు. గడి ఎండాకాలంలో చల్లగా, శీతాకాలం వెచ్చగా ఉంటుంది.

మంజీరపై రాతి వంతెన

- రాష్ట్ర సరిహద్దులో నిర్మాణం
- నాటి ఇంజినీర్ల నైపుణ్యానికి సజీవ సాక్ష్యం




మంజీరపై నిర్మించిన రాతి వంతెన

బోధన్: తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులో సాలూర శివారులో మంజీర నదిపై 90 ఏళ్ల క్రితం నిజాం పాలనలో నిర్మించిన లో లెవల్ రాతి వంతెన చెక్కు చెదరలేదు. నిజాంపాలనలో (1935–36) నిర్మించిన ఈ వంతెన నాటి ఇంజినీర్ల నైపుణ్యానికి సాక్ష్యంగా నిలుస్తోంది. వంతెనను పూర్తిగా రాయి, సున్నం డంగుతో పటిష్టంగా నిర్మించారు. రెండు రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యం కోసం నిర్మించిన వంతెన మంజీరాకు భారీ వరదలు వచ్చినా తట్టుకుని నిలబడింది. 1985–86లో రాతి వంతెనకు దిగువన మహారాష్ట్ర–ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం కలిసి నిర్మించిన హైలెవల్ వంతెన ఐదేళ్ల క్రితం పూర్తిగా దెబ్బతిన్నది. కానీ రాతి లోలెవల్ వంతెన ఇప్పటికీ చెక్కుచెదరకుండా చరిత్రకు సాక్షిగా నిలుస్తోంది.

గ్రావిటీతో నీటి సరఫరా..

నిజామాబాద్ సిటీ: పంపింగ్ వ్యవస్థతో పనిలేకుండా మంచిప్ప చెరువు నుంచి గ్రావిటీ ద్వారా 1892లోనే నీటిని సరఫరా చేశారు నాటి ఇంజినీర్లు. నిజాం కాలం నాటి ఇంజినీర్ల అద్భుత ప్రతిభకు నిదర్శనం మంచిప్ప లార్జ్ ట్యాంక్.

మంచిప్ప చెరువునీటితో ఇందూరువాసుల దాహార్తిని తీర్చేందుకు నాటి నిజాం నవాబు కృషి చేశారు. 1892 ప్రాంతంలో మంచిప్ప చెరువు నుంచి నీటిని ఎలాంటి పంపింగ్ వ్యవస్థ లేకుండా కేవలం గ్రావిటీద్వారా నీటిని కంజర–కులాస్‌పూర్ వరకు తీసుకువచ్చారు. కులాస్‌పూర్ వద్ద ఫిల్టర్ బెడ్‌లో నీటిని శుద్ధి చేసి పైపుల ద్వారా నిజామాబాద్ నగరంలోని పెద్ద బజార్‌లో నిర్మించిన వాటర్‌ట్యాంక్‌లోకి వస్తాయి. ఇక్కడి నుంచి నగరంలోని పలు ప్రాంతాలకు ఈ నీటిని సరఫరా చేస్తున్నారు. 440 మీటర్ల ఎత్తులో ఉన్న మంచిప్ప చెరువులోని నీటిని దిగువన 380 మీటర్ల వరకు కులాస్‌పూర్ ఫిల్టర్‌బిడ్ వరకు నీరు గ్రావిటీ ద్వారా సరఫరా అవుతున్నాయి. ఎలాంటి టెక్నాలజీ ఉపయోగించకుండా కేవలం భూమార్గంలోనే కాల్వల ద్వారా (గ్రావిటీ) చెరువు నీటిని తరలించారు. ఈ వ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతోంది. పైపుల మరమ్మతులు వంటి చిన్నచిన్న సమస్యలు మినహా మిగతా పెద్దగా ఎలాంటి సమస్యలు లేవు. సుమారు వందేళ్లుగా ఇందూరువాసులు తమ గొంతులు తడుపుకుంటున్నారు.




1892లో నిజాం నవాబు వేసిన శిలాఫలకం

అద్భుత నిర్మాణం..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : గోదావరికి ఉపనది అయిన మంజీర్‌పై అచ్చంపేట వద్ద నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మించారు. నిజాం పాలనలో ఇంజినీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ నేతృత్వంలో 1923 సంవత్సరంలో నిర్మాణ పనులు మొదలుపెట్టి 1931లో పూర్తి చేశారు. రూ. 3.15 కోట్ల వ్యయంతో నిర్మాణం పూర్తి చేశారు. రెండున్నర లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీటితోపాటు బోధన్, నిజామాబాద్ పట్టణాల ప్రజలకు తాగు నీటిని అందించేందుకు ప్రాజెక్టు నిర్మించారు. అప్పట్లో ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 1,400 అడుగులు(29.5 టీఎంసీలు). ఏటా వర్షాకాలంలో పూడికతో ప్రాజెక్టు సామర్థ్యం పడిపోతూ వచ్చింది. 1975లో నీటినిలువ సామర్థ్యంపై ఇంజినీరింగ్ అధికారులు రీసెర్చ్ చేశారు. ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 11.89 టీఎంసీలకు పడిపోవడంతో ఎఫ్‌ఆర్‌ఎల్ లెవన్‌ను 4.5 అడుగులకు పెంచారు. దీంతో 1978 సంవత్సరం నుంచి ప్రాజెక్టు నీటిమట్టం 1,405 అడుగుల (17.8 టీఎంసీ)కు చేరింది. అంతేకాకుండా ప్రాజెక్టులో పూడికను అరికట్టడానికి సంగారెడ్డి జిల్లాలో సింగూరు జలాశయాన్ని నిర్మించారు. అయినా నిజాంసాగర్ ప్రాజెక్టు గర్భం నిండా పూడికమట్టి నిండి ఉంది. ఇటీవల నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాజెక్టును సందర్శించిన సందర్భంలో పూడిక తీస్తామని హామీ ఇచ్చారు. నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ ఆధునికీకరణ పనుల కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రూ. 459.5 కోట్లు మంజూరు చేశారు. తద్వారా ప్రధాన కాలువకు సిమెంట్ లైనింగ్ పనులు జరిగాయి.

వరదపోటును తట్టుకున్న పోచారం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కామారెడ్డి, మెదక్ జిల్లాల సరిహద్దుల్లో నాగిరెడ్డిపేట మండలం పోచారం శివారులో నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1917లో పోచారం ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 1922లో నిర్మాణం పూర్తయ్యింది. అప్పట్లో రూ. 27.11 లక్షల వ్యయంతో ప్రాజెక్టు నిర్మించారు. ఇంజినీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. 21 అడుగుల ఎత్తు, 1.7 కిలోమీటర్ల పొడవుతో ఆనకట్టను నిర్మించారు. ప్రాజెక్టు నిర్మాణంలో రాళ్లు, డంగు సున్నం మాత్రమే వినియోగించారు. మొదట 3.4 టీఎంసిల నీటినిల్వ సామర్థ్యంతో ప్రాజెక్టును నిర్మించాలని తలచినప్పటికీ



ప్రతికూల పరిస్థితుల కారణంగా 2.423 టీఎంసీలకు పరిమితం చేశారు. 70 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకునే శక్తి ఉన్న పోచారం ప్రాజెక్టులోకి గత నెల 27, 28 తేదీల్లో ఎవరూ ఊహించని రీతిలో 1.82 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. అయినా ప్రాజెక్టు స్ట్రక్చర్ బలంగా ఉండడంతో దెబ్బతినలేదు.

బకాయిల విడుదలకు 'పోరుబాట'

- పెండింగ్‌లో నాలుగేళ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్
- జిల్లాలో సుమారు రూ.86 కోట్ల బకాయిలు
- నేటి నుంచి ఉన్నత విద్యా కళాశాలలు బంద్



ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు (ఫైల్)

నిజామాబాద్‌అర్బన్: స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థల యాజమాన్యాలు పోరుబాట పట్టాయి. నాలుగేళ్లుగా బకాయిలు విడుదల కాకపోవడంతో ఉన్నత కళాశాలలకు సోమవారం నుంచి బంద్ ప్రకటిస్తూ హయ్యర్ ఇన్‌స్టిట్యూషన్ అసోసియేషన్ నిర్ణయించింది. జిల్లాలో మొత్తం ఉన్నత విద్యా కళాశాలలు 109 ఉండగా, అందులో ప్రైవేటు కళాశాలలు 79 ఉన్నాయి. వీటితోపాటు మూడు ఇంజినీరింగ్ కళాశాలలు కొనసాగుతున్నాయి. సుమారు 50వేల మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు.

గుదిబండగా బకాయిలు

జిల్లాలోని ప్రైవేట్ కళాశాలలకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇబ్బందికరంగా మారింది. గత నాలుగు సంవత్సరాలుగా బకాయిల చెల్లింపులలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందంటూ యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. మరోవైపు దశల వారీగా బకాయిలను విడుదల చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాకు చెందిన కళాశాలలకు సుమారు రూ.86 కోట్ల వరకు ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉంది.

ఇంజినీరింగ్ కళాశాలలకు	22 కోట్లు
బీఈడీ కళాశాలలకు	15.60 కోట్లు

విద్యార్థులపై ప్రభావం..

ఉన్నత కళాశాలల బంద్‌తో విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడనుంది. ప్రస్తుతం డిగ్రీ కళాశాలల అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి కాగా, పీజీలో చేరేందుకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. డిగ్రీ పూర్తయిన విద్యార్థులు సర్టిఫికెట్స్ తీసుకోవాల్సి ఉంటుంది. రీయింబర్స్‌మెంట్ మీద ఆధారపడిన విద్యార్థులు ఫీజు చెల్లించలేక ఉన్నత చదువులకు దూరమయ్యే అవకాశం ఉంది.

ప్రైవేట్ ఉన్నత కళాశాలలు	
డిగ్రీ	50
పీజీ	11
బీఈడీ	13
బీపీఈఇడ్	01
ఎంబీఏ	03
ఎంసీఏ	01
ఇంజినీరింగ్	03

జిల్లాలో బకాయిల వివరాలు

సంక్షేమ శాఖ	దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు	ప్రభుత్వ బకాయిలు (రూ.)
ఎస్సీ	20,000	7.09 కోట్లు
బీసీ	23,000	33 కోట్లు
ఎస్టీ	12,000	9.70 కోట్లు

వెంటనే విడుదల చేయాలి



పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాలి. కళాశాలలకు బకాయిపడిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలి. – రాజేశ్వర్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

నిరవధికంగా కొనసాగుతుంది..



ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం ఇదివరకు చాలా సార్లు ప్రభుత్వానికి విన్నవించాం. అయినా ఫలితం లేదు. అందుకే కళాశాలల బంద్ పాటిస్తున్నాం. నిధులు విడుదల చేసే వరకు కళాశాలల బంద్ నిరవధికంగా కొనసాగుతుంది. – సుధాకర్, ఉమ్మడి జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి

- అర్వింద్ రెచ్చగొట్టే ప్రకటనలు మానుకోవాలి
- యూరియా కొరత పాపం బీజేపీదే
- రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి

వేల్పూర్: ఎంపీ అర్వింద్ తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే మాటలు మానుకోవాలని రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి హితవు పలికారు. వేల్పూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డితో కలిసి ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీసులు ఒక వర్గానికే మద్దతుగా ఉంటున్నారని, దానికి కాంగ్రెస్ నాయకులు వత్తాసు పలుకుతున్నారని ఎంపీ అర్వింద్ చేసిన ఆరోపణలు కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని చేసినవేనని మండిపడ్డారు. యూరియా సరఫరా వైఫల్యానికి కారణంగా కాంగ్రెస్ అని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. కేంద్రం పంపిన యూరియాను కాంగ్రెస్ ఎక్కడైనా బ్లాక్ మార్కెట్ చేస్తోందా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన యూరియాను కేంద్రం సక్రమంగా ఇవ్వకపోవడం వల్లనే కొరత ఏర్పడుతోందన్న విషయం రైతులు గుర్తించాలని కోరారు. యూరియ కోసం సీఎం, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారి యూరియా కొరతపై కేంద్రానికి విన్నవిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రం కావాలనే మన రాష్ట్రానికి కోత విధించిందన్నారు. వేల్పూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ 'యాత్రాదానం' ప్రారంభం

ఖలీల్‌వాడి: పర్యాటక రంగ అభివృద్ధి, ప్రయాణికులకు విభిన్నమైన సేవలు అందించేందుకు 'యాత్ర దానం- గిఫ్ట్ ఏ బస్ ట్రావెల్' పథకాన్ని ప్రారంభించినట్లు ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్ఎం మాట్లాడారు. ఈ పథకం కింద కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు, విద్యా సంస్థలు, సమాజ సేవా సంస్థలు, సంయుక్త కుటుంబాలు స్పాన్సర్షిప్ ద్వారా బస్సు యాత్రలను అందించవచ్చని తెలిపారు. స్పాన్సర్లు చెల్లించిన మొత్తాన్ని కార్పొరేషన్ ప్రత్యేక ఖాతాలో జమ చేసి, లబ్ధిదారుల కోసం ఆర్టీసీ ద్వారా సమయానుకూలంగా ప్రత్యేక బస్సులు నడిపిస్తామన్నారు. ఈపథకం కావాల్సిన వారు..

నిజామాబాద్ డిపో-1	9959226016
నిజామాబాద్ డిపో-2	9959226017
కామారెడ్డి డిపో	9959226018
ఆర్మూర్ డిపో	9959226019
బాన్సువాడ డిపో	9959226020
బోధన్ డిపో	9959226001

నిజామాబాద్ బస్‌స్టేషన్ మాస్టర్ 94904 10939ను సంప్రదించాలన్నారు. డిప్యూటీ ఆర్ఎం మధుసూదన్, డిపో మేనేజర్లు ఉన్నారు.

దాతలు ముందుకు రావాలి

ఆర్మూర్‌టౌన్: యాత్రాదానం పథకంలో ఆర్థిక సహాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలని ఆర్మూర్ డిపో మేనేజర్ రవి కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అంగన్‌వాడీల ఆందోళన బాట

- నేడు మంత్రుల ఇళ్ల ఎదుట ధర్నాలు
- 25న చలో సెక్రటేరియట్
- అక్టోబర్ 8న జిల్లా కేంద్రాల్లో పాదయాత్ర
- 17 నుంచి ఆన్‌లైన్ సమ్మెకు పిలుపు



నిజామాబాద్‌నాగారం: సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఉద్యమబాట పట్టాయి. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల బాగోగులను అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చూసుకుంటున్నారు. నిత్యం వారికి పాలు, గుడ్లు, పౌష్టికాహారంతోపాటు ప్రీ ప్రైమరీ విద్యను అందిస్తున్నారు. ఇవే కాకుండా శ్రీమంతాలు, అక్షరాభ్యాసం తదితర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే, కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేదని, పని భారం పెరుగుతోందని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రూ.18వేల వేతనం, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేసి, ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇవే కాకుండా ఖాళీలను భర్తీ చేయాలని, మూడు నెలల పీఆర్సీ, సమ్మె కాలపు వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర డిమాండ్ల సాధనకు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చింది. అందులో భాగంగా సోమవారం మంత్రుల ఇళ్లను ముట్టడించి ధర్నా చేపట్టనున్నారు. అయినా స్పందించక పోతే 25న చలో సెక్రటేరియట్, అక్టోబర్ 8న జిల్లా కేంద్రాల్లో 5కి.మీల పాదయాత్ర, 17వ తేదీ నుంచి ఆన్‌లైన్ సమ్మె చేపట్టాలని నిర్ణయించారు.

అంగన్‌వాడీల సమాచారం

జిల్లాలో సీడీపీవో ప్రాజెక్టులు	5
మొత్తం అంగన్‌వాడీలు	1501
బాలింతలు	61,200
గర్భిణులు	9821
చిన్నారులు	81,262
టీచర్లు	1427
ఆయాలు	901

సమస్యలు పరిష్కరించాల్సిందే

ఏళ్ల తరబడిగా సమస్యలు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. పనిభారం పెరిగిపోతుంది. జీతాలు తక్కువగానే ఉన్నాయి. ఎవరూ పట్టించుకోవడం లేదు. అందుకే ఉద్యమిస్తున్నాం.

– పి స్వర్ణ, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

మావి న్యాయమైన డిమాండ్లు..

మేము న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వాల ఎదుట ఉంచాం. గత ప్రభుత్వాలు నమ్మించి మోసం చేశాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సమస్యలు పరిష్కరించాల్సిందే. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో ఆందోళన చేస్తాం.

– కైరి దేవగంగు, జిల్లా అధ్యక్షురాలు

అద్భుతం అలీసాగర్

- తొమ్మిది దశాబ్దాల క్రితం నిర్మాణం
- నిజాం కాలంలో రూపకల్పన చేసిన సీఈ నవాబ్ అలీ
- జిల్లా కేంద్రానికి తాగునీటి సరఫరా

నేడు ఇంజినీరింగ్స్ డే



ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ గ్రామ శివారులో నిర్మాణమైన అలీసాగర్ ప్రాజెక్టు

బోధన్: నిజాం ఏడో రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ హయాంలో భారీ ప్రాజెక్టులకు రూపకల్పన చేసిన నాటి చీఫ్ ఇంజినీర్ అలీ నవాజ్ జంగ్ ఎడపల్లి మండలం ఠాణాకలాన్ గ్రామ శివారులో ఎత్తైన గుట్టల మధ్య అలీసాగర్ రిజర్వాయర్ నిర్మాణానికి డిజైన్ చేశారు. 93 ఏళ్ల క్రితం (1932లో) దీనిని నిర్మించగా ఆయన పేరు మీదుగానే అలీసాగర్ రిజర్వాయర్‌గా నామకరణం చేశారు. నవాబ్ అలీ ఇంజినీరింగ్ నైపుణ్యాలు, దార్శనికతతో రూపుదిద్దుకున్న రిజర్వాయర్‌తో బహుళ ప్రయోజనాలు చేకూరుతున్నాయి. రిజర్వాయర్ నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టు డి-46 కాలువ ద్వారా ఎడపల్లి, బోధన్, రెంజల్ మండలల పరిధిలో 1500 ఎకరాలకు సాగు నీరందుతోంది. నిజామాబాద్ నగర ప్రజల తాగు అవసరాలకు ఈ రిజర్వాయర్ నుంచి రోజూ నీరు సరఫరా అవుతోంది. రిజర్వాయర్ పక్కనే ఉన్న అలీసాగర్ ఉద్యానవనం జిల్లాలో ప్రముఖ్య పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. రిజర్వాయర్‌లో పర్యాటకులకు బోటింగ్ సౌకర్యం కూడా ఉంది.

150 ఏళ్ల రాజరాజేశ్వరాలయం



డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి శివారులో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతానికి ఆనుకుని ఉన్న పురాతన రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని దాదాపు 150 ఏళ్ల క్రితం నిర్మించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. పూర్తిగా రాతితోనే డంగు సున్నం కలిపి నిర్మించారు.మరో వందేళ్లయినా ఉండే విధంగా ఉందని చెప్పొచ్చు. దీని పక్కనే ఉన్న వంటశాల (రంగుమాల్), రథ భవనం కూడా రాతితో నిర్మించారు.

భారీ వరదను తట్టుకునే అలుగు

ఇందల్వాయి: సిర్నాపల్లి చుట్టుపక్కల గ్రామాలకు సాగు నీరు అందించే ఉద్దేశంతో అటవీ ప్రాంతంలో నిర్మించిన జానకీబాయి చెరువు అలుగు నిర్మాణం ఇప్పటికీ వరద తాకిడికి తట్టుకుని నిలబడుతోంది. ఐదు అడుగుల వెడల్పు, 40 అడుగుల ఎత్తు, 300 అడుగుల పొడవుతో ఉన్న ఈ అలుగుని కేవలం రాళ్లు, డంగు సున్నంతోనే నిర్మించారు. నీటి ప్రవాహానికి అలుగు పడిపోకుండా సహజ సిద్ధంగా ఉన్న రాళ్ల పైనే అలుగు నిర్మించారు.



పద్మశాలి వసతిగృహం అధ్యక్షుడిగా యాదగిరి



పద్మశాలి వసతిగృహం కమిటీ నూతన కార్యవర్గం



ఎన్నికల అధికారుల నుంచి నియామకపత్రం అందుకుంటున్న దీకొండ యాదగిరి



ఓట్లు వేస్తున్న సభ్యులు

నిజామాబాద్ నాగారం: నగరంలోని కోటగల్లి పద్మశాలి వసతిగృహం అధ్యక్షుడిగా దీకొండ యాదగిరి గెలుపొందారు. ఆయన ప్యానెల్‌లోని 11 మంది అభ్యర్థులు విజయం సాధించారు. ఎన్నికల్లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన ఓటర్లు పాల్గొన్నారు. నగరంలోని పద్మశాలి ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన పోలింగ్‌లో 85 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 894 ఓట్లకు 757 ఓట్లు పోలయ్యాయి. 11 పదవులకు 34 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. దీకొండ యాదగిరి, ఎస్ఆర్ సత్యపాల్, కొండి రమేశ్ ప్యానెళ్లు బరిలో నిలిచాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కాగా రాత్రి వరకు కొనసాగింది. యాదగిరికి 441 ఓట్లు రాగా, సమీప అభ్యర్థి సత్యపాల్‌కు 236 ఓట్లు వచ్చాయి. ఎన్నికల అధికారిగా న్యాయవాది రేగొండ గంగాప్రసాద్, అసిస్టెంట్ ఎన్నికల అధికారులుగా పగిడిమారి యాదగిరి, కర్లం రాములు వ్యవహరించారు. ఎన్నికలకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నూతన కార్యవర్గం ఇదే..

అధ్యక్షుడిగా దీకొండ యాదగిరి, ప్రధాన కార్యదర్శి గంట్యాల వెంకటనర్సయ్య, కోశాధికారిగా కన్న రాజు, ఉపాధ్యక్షులుగా గుజ్జేటి వెంకటనర్సయ్య, ఎనగందుల మురళి, నూకల విజయసారథి, సహాయ కార్యదర్శి బొమ్మెర తులసీప్రసాద్, లక్కపత్రి దేవిదాస్, గాలిపల్లి వెంకటేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కైరంకొండ మురళి, కల్చరల్ సెక్రెటరీగా తన్నీరు శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు కొనసాగుతుంది. ఆదివారం గోదావరిలోకి నీటి విడుదలను 89,680 క్యూసెక్కులకు తగ్గించారు. 22 వరద గేట్ల ద్వారాగోదావరిలోకి నీటి విడుదల కొనసాగుతుంది. ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా 8వేల క్యూసెక్కు లు, ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 800 క్యూసెక్కులు, మిషన్‌భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 684 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి అంతేస్థాయి నీరు నిల్వ ఉంది. ఆదివారం సెలవు దినం కావడంతో ప్రాజెక్ట్ అందాలను తిలకించుటకు అధిక సంఖ్యలో పర్యటకులు తరలి వచ్చారు.

గోదావరి నదికి..

రెంజల్(బోధన్): నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో మంజీరా నదిలోకి నీరు చేరి మండలంలోని కందకుర్తి వద్ద గోదావరి నదిలో కలుస్తుంది. ఈక్రమంలో గోదావరికి వరద పోటెత్తడంతో నదిలోని పురాతన శివాలయం పూర్తిగా నీట మునిగింది.

హిందువులను స్వయంసేవకులుగా చేయడమే లక్ష్యం





సమావేశంలో మాట్లాడుతున్న కాపర్తి గురుచరణం.. పాల్గొన్న స్వయంసేవకులు

సుభాష్‌నగర్: ప్రతీ హిందువును స్వయంసేవక్‌గా తయారు చేయడమే శతాబ్ది ఉత్సవాల లక్ష్యమని ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ చాలక్ డాక్టర్ కాపర్తి గురుచరణం అన్నారు. ఇందుకోసం రానున్న విజయదశమి నుంచి ఏడాది పాటు వివిధ కార్యక్రమాలను రూపొందించినట్లు తెలిపారు. నగరంలోని న్యూ హౌసింగ్‌బోర్డ్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఆర్ఎస్ఎస్ కంఠేశ్వర్, నాందేవ్‌వాడ ఉప నగరాల ఆధ్వర్యంలో గణవేశ్‌ధారి స్వయంసేవకుల సంఘీక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురుచరణం ముఖ్య వక్తగా విచ్చేసి, మాట్లాడారు. సామాజిక సమరసత, ప్రకృతి పరిరక్షణ, కుటుంబ వ్యవస్థ సంరక్షణ ఆధారంగా బాధ్యతాయుతమైన సమాజాన్ని నిర్మించడం కోసమే సంఘం పని చేస్తుందన్నారు. అంతకు ముందు హౌసింగ్ బోర్డ్ కాలనీలో పథ సంచలన్ నిర్వహించారు. నగర కార్యవాహ అర్గుల సత్యం, ఉపనగర కార్యవాహలు మధుకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిని చంపిన కొడుకు అరెస్టు



బాన్సువాడ: తల్లిని సాకలేక మంజీర నదిలో తోసేసిన కొడుకును అరెస్ట్ చేసినట్లు బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి తెలిపారు. బాన్సువాడ డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బోర్లం గ్రామానికి చెందిన సాయవ్వ(75)కు కొడుకు బాలయ్య ఉన్నాడు. వృద్ధురాలైన సాయవ్వ గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురయింది. ఆమెకు సేవలు చేయడానికి ఇంట్లో ఎవరూ లేరు. దీంతో కొడుకు బాలయ్య ఆమెను సాకలేక ఈనెల 8న ఓ మైనర్‌తో కలిసి సాయవ్వను బైక్‌పై ఎక్కించుకొని బోలక్‌పల్లి బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లి బ్రిడ్జి పైనుంచి నదిలోకి తోసివేశాడు. ఈ 11న సాయవ్వ మృతదేహం నదిలో తేలడంతో ఈనెల 12న బోర్లం గ్రామ పెద్దలు బాలయ్య వద్ద ఉన్న మైనర్‌ను పట్టుకొని ప్రశ్నించారు. అతడు సాయవ్వను కొడుకే నదిలో పడేశాడని తెలిపాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కొడుకు కోసం గాలింపు చేపట్టారు. ఈనెల 14న నిందితుడు ఎర్రోళ్ల బాలయ్యతోపాటు మైనర్ కలిసి బోర్లం నుంచి వస్తుండగా కొయ్యగుట్ట చౌరస్తా వద్ద అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. వారి వద్ద ఉన్న బైక్‌ను, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. బాలయ్యను రిమాండ్‌కు తరలించామని, మైనర్‌ను జువైనల్ అబ్జర్వేషన్ హోంకు తరలించామని అన్నారు.

క్రైం కార్నర్

మురికి కాలువలో వ్యక్తి మృతదేహం లభ్యం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని శివసాయి కాలనీలోగల మురికి కాలువలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. సదరు మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి ప్యాంట్ జేబులో దొరికిన ఆధార్ కార్డులో నిర్మల్ లక్ష్మణ్ పేరు ఉందన్నారు. వయస్సు 42, చిరునామా బ్రాహ్మణపల్లి, ఎడపల్లి మండలం అని ఉందన్నారు. మృతుడు బ్లాక్ కలర్ షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ధరించినాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని సీఐ తెలిపారు.

బ్రిడ్జిపై దిగబడిన లారీ



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని అడవిలింగాల్ గేట్ వద్ద ఎల్లారెడ్డి-కామారెడ్డి ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జిపై ఆదివారం లారీ అదుపుతప్పి బ్రిడ్జిని ఢీకొని బురదలో కూరుకుపోయింది. లారీ ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డికి వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్అండ్‌బీ డీఈ నారాయణ, ఏఈ ఐశ్వర్యలు స్పందించి బ్రిడ్జిపై దిగబడిపోయిన లారీని క్రేన్ల సహాయంతో తొలగించారు.

నారింజపండ్ల లారీ బోల్తా



ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లి శివారులో నారింజ పండ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. నారింజ పండ్ల లోడ్‌తో ఉన్న లారీ ఆదివారం హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్‌వైపు జాతీయ రహదారిపై వెళ్తోంది. మండలంలోని చంద్రాయన్‌పల్లి శివారులో ప్రమాదవశాత్తు లారీ అదుపుతప్పి బోల్తాపడి సర్వీస్‌రోడ్డుపై పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. లారీలోని పండ్లన్నీ రోడ్డుపై పడిపోయాయి.

మట్కా ఆడుతున్న ముగ్గురు అరెస్టు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో మట్కా ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ ఆదివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు మట్కా స్థావరంపై దాడిచేసి గుజరాతి గోవర్ధన్, వొడుల మోహన్, మహ్మద్ రహీముద్దీన్‌ను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ. 15వేల నగదు, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పరారయిన మట్కా నిర్వాహకుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పలువురిపై కేసు నమోదు

మోపాల్: మండలంలోని ఒడ్డెర కాలనీకి చెందిన దండుగుల ఎల్లయ్యపై అకారణంగా దాడిచేసిన పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సుష్మిత ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా.. ఎల్లయ్య టిప్పర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇదేక్రమంలో ఆదివారం సాయంత్రం గేదెలు అడ్డుగా ఉన్నాయని టిప్పర్‌ను రోడ్డు పక్కన నిలిపాడు. వెనకాల బైక్‌లపై వస్తున్న నిజామాబాద్‌కు చెందిన యువకులు టిప్పర్‌ను ఎందుకు నిలిపావంటూ ఎల్లయ్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, దాడికి పాల్పడ్డారు. ఆరు ద్విచక్ర వాహనాలపై పదీ మంది యువకులు వచ్చి దాడిచేశారని ఎల్లయ్య ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చిరుత దాడిలో లేగదూడలు మృతి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు అటవీ ప్రాంతంలో చిరుత దాడిచేసి రెండు లేగ దూడలను హతమార్చినట్లు బాధితుడు దూప్‌సింగ్ తెలిపారు. నాలుగు రోజుల క్రితం ఆవుల మందను మేతకు అడవికి తీసుకెళ్లగా సాయంత్రం రెండు లేగదూడలు కనిపించలేదని తెలిపారు. లేగదూడల కోసం మూడు రోజులుగా అటవీ ప్రాంతంలో గాలించగా ఆదివారం కుళ్లిపోయిన లేగదూడల కళేబరాలు కనిపించినట్లు బాధితుడు తెలిపాడు. చిరుత దాడిలోనే లేగదూడలు మృతి చెందాయని, అటవీశాఖ అధికారులు నష్టపరిహారం అందజేయాలని కోరారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధం



ధర్పల్లి: మండల కేంద్రంలోని గోసంగి కాలనీలో షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధమైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా.. గోసంగి కాలనీలో సల్ల భాగ్య, తురపాటి సాయమ్మ కుటుంబ సభ్యులతో కలిసి పాత సామాన్ల కొనుగోలు వ్యాపారం చేసుకుంటూ నివాసం ఉంటున్నారు. ఈక్రమంలో వారు ఎప్పటిలాగానే ఆదివారం ఉదయం బయటకు వెళ్లారు. మధ్యాహ్నం సల్ల భాగ్య ఇంట్లో విద్యుత్ తీగలు కాలిపోయి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అనంతరం పక్కన ఉన్న తురపాటి సాయమ్మ ఇంట్లోకి మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి మంటలను ఆర్పి వేశారు. కానీ అప్పటికే రెండు ఇళ్లలోని సామాన్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సల్ల భాగ్య ఇంట్లో తులం బంగారం, వెండి ఆభరణాలు, రూ.3లక్షల నగదు కాలిపోగా, తురపాటి సాయమ్మ ఇంట్లో కొంత నగదుతోపాటు వంట సామగ్రి, దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. సుమారు రెండు ఇళ్లల్లో కలిపి సుమారు రూ. 5లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని వారు వేడుకున్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్మూర్ బాలరాజ్ బాధిత కుటుంబాలను పరామర్శించి వంట సామగ్రి, దుస్తులను అందజేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



రవీందర్‌రెడ్డి (ఫైల్)

ఇందల్వాయి/ఖలీల్‌వాడి: ఇందల్వాయి-సిర్నాపల్లి రైల్వే లైనును ఓ వ్యక్తి దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. ఇందల్వాయి మండలం గన్నారం గ్రామానికి చెందిన బద్దం రవీందర్ రెడ్డి (46) ఆదివారం ఉదయం తన పొలం వద్దకు బయలుదేరాడు. ఈక్రమంలో ఇందల్వాయి-సిర్నాపల్లి రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలను అతడు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పోచారం ప్రాజెక్టు నీటిలో పడి యువకుడు..



మహబూబ్ (ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారం ప్రాజెక్టు నీటిలో మునిగి ఓ యువకుడు మృతిచెందాడు. వివరాలు ఇలా.. మెదక్ పట్టణానికి చెందిన షేక్ మహబూబ్(20)అనే యువకుడు ఆదివారం తన స్నేహితులతో కలిసి మండలంలోని పోచారం ప్రాజెక్టుకు వచ్చాడు. ప్రాజెక్టు అలుగు పైనుంచి వెళ్తుండగా, కాలు జారి నీటి ప్రవాహంలో పడిపోయాడు. నీటమునిగి ఊపిరాడక మృతిచెందినట్లు తెలిసింది. మృతుడి అన్న షేక్ వాజీద్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు నాగిరెడ్డిపేట పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

చికిత్స పొందుతూ వివాహిత..

లింగంపేట(ఎల్లారెడ్డి): ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై దీపక్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని అయ్యపల్లితండాకు చెందిన దేవసోత్ సుజిత(20) అత్తింటివారి వేధింపులు భరించలేక ఆగస్టు 10 గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు..



ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపారు. నగరంలోని న్యాల్కల్ రోడ్‌లో గల కల్లు బట్టి సమీపంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి స్పృహ లేని స్థితిలో గుర్తించారు. వెంటనే సదరు వ్యక్తిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడు లేత ఆరెంజ్ రంగు, కలర్ ఫుల్ షర్ట్, ముదురు నీలి రంగు ప్యాంటు ధరించినట్లు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 65 ఏళ్ల వరకు ఉంటాయని, న్యాల్కల్ రోడ్‌లో భిక్షాటన చేసేవాడని అన్నారు. అతని దగ్గర ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే ఐదో టౌన్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.



నవీపేట: నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. నవీపేట ఎస్సై తిరుపతి తెలిపిన వివరాలు ఇ లా.. నవీపేట శివారులోని అయ్యప్ప ఆలయ సమీపంలో ఈనెల 12న గుర్తుతెలియని ఓ వ్యక్తి అస్వస్థతకు గురైయ్యాడు. వెంటనే స్థానికులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి వయస్సు సుమారు 36ఏళ్లు ఉంటాయని ఎస్సై అన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మోపాల్/ఖలీల్‌వాడీ: నగరశివారులోని బోర్గాం (పి) జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 1991-92 బ్యాచ్ విద్యార్థులు, గురువులు ఆదివారం కిసాన్ మున్నూరు కాపు కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 33 ఏళ్ల తర్వాత విద్యార్థులందరూ ఒకే వేదికపై కలుసుకోవడంతో ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ అనాటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకున్నారు. నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి, సన్మానించారు. పూర్వ విద్యార్థి, సినీ రచయిత బండోజీ సతీష్ తన వ్యాఖ్యానంతో ఆకట్టుకుంటూ గురుశిష్యుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆహ్లాదపరిచాడు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.

యోగా గురువుకు సన్మానం



రుద్రూర్: మండల కేంద్రానికి చెందిన యోగా గురువు డాక్టర్ విశ్వనాథ్ మహాజన్‌ను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదివారం సన్మానించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశేష సేవలందించిన వారిని సికింద్రాబాద్‌లో ఘనంగా సత్కరించారు. ఇటీవల యోగా ఆంధ్రాలో భాగంగా రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సెమినార్‌కు విశ్వనాథ్ మహాజన్ హాజరై యోగా ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో భారత స్వాభిమాన్ ట్రస్ట్ పతంజలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రావ్ పాల్గొన్నారు.

కరెంట్‌షాక్‌తో నెమలి మృతి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కృష్ణాజివాడి గ్రామ శివారులో కరంట్ వైర్లకు నెమలి తగిలి షాక్‌తో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో శనివారం రాత్రి అకస్మాత్తుగా కరంటు సరఫరా నిలిచిపోవడంతో ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది వచ్చి స్తంభాలను, వైర్లను పరిశీలించారు. సమస్యను గుర్తించకపోవడంతో వేరే లైన్‌కు కనెక్షన్ ఇచ్చారు. తిరిగి ఆదివారం అధికారులు గ్రామశివారులో గల విద్యుత్ స్తంభాలు, వైర్లను పరిశీలించారు. శివారులోని వైర్లపై నెమలి పడి చనిపోయినట్లు కనిపించిందన్నారు. దీంతో వైర్లపై మృతి చెంది ఉన్న నెమలిని కిందికి తీసి యథావిధిగా కరంటు కనెక్షన్ ఇచ్చారు.